# స్కావెంజర్ల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

## కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆందోళన

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్కావెంజర్ల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఎఓకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కావెంజర్లకు 9 నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో పెట్టడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న స్కావెంజర్ల వేతనాలను విడుదల చేయాలని లేనియెడల పెద్ద యెత్తున ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాములు, కవిత, రజిత, స్వామి, పద్మ, కళావతి, రవీందర్, రమేష్, మల్లేశం, సురేష్, శ్రావణి, వెంకటేష్, రేణుక, అఖిల్, గంగా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# కూలీల పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు..ఇద్దరు కూలీలు మృతి

**ములుగు, అక్టోబరు 17 (ప్రభాతవార్త):** కూలీల పైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా ములుగులోని రాజీవ్‌రహదారిపై శుక్రవారం జరిగింది. ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ములుగు మండలం కమలాబాద్ గ్రామానికి చెందిన బోయిని సాయిలు(44), మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన లెంకల రాజమల్లు(45)లు రాజీవ్‌రహదారిపై ఉన్న డివైడర్‌లో పెరిగిన గడ్డిని తొలగించడానికి కూలీకి వచ్చారు. వారి పని వారు చేసుకుంటున్న క్రమంలో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో హైద్రాబాద్ నుండి గోదావరిఖనికి వెళ్తున్న గోదావరిఖని డిపో బస్సు ఢీకొట్టింది. దీంతో సాయిలు, రాజమల్లు అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అజాగ్రత్త, అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని తెలిపారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



భూ భాదితులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## భూ భారతి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం, అక్టోబరు 17(ప్రభాతవార్త):** భూభారతి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొల్చారంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన అకస్మాత్తుగా తనిఖీ చేశారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను, రికార్డులను, హాజరు పుస్తకాల్ని పరిశీలించారు. వివిధ భూసమస్యలతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన భూ బాధితులతో మాట్లాడుతూ సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. భూ సమస్యలతో వచ్చిన ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి పరిష్కారాన్ని సూచించాలన్నారు. భూ సమస్యల వల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులు వారికి అవగాహన కల్పించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, సిబ్బంది గంగాధర్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించాలి

### అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశం



విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**మునిపల్లి, అక్టోబరు 17(ప్రభాతవార్త):** మోడల్ స్కూల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను వెంటనే తీర్చాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మునిపల్లిలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, మోడల్ స్కూల్‌ను శుక్రవారం సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మోడల్ స్కూల్‌లో నీటి సమస్య వుందని విద్యార్థులు అదనపు కలెక్టర్‌తో మొరపెట్టుకున్నారు. వెంటనే ఆయన డిఈపిఆర్‌కు ఫోన్‌లో మాట్లాడి వెంటనే నీటి సమసయ తీర్చాలని ఆదేశించారు. అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహంలోని విద్యార్థుల గదులు, వంట గది, స్టోర్ రూమ్, బాత్రూమ్‌లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం తీరు గురించి అడిగి తెలుసుకున్నారు అనంతరం వసతి గృహంలో ప్రహరీ గోడ, సెప్టిక్‌ట్యాంక్, నూతన బాత్‌రూం, పెయింటింగ్ పనుల నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ గంగాభవాని, ఎంపిడిఓ హరినందన్‌రావు తదితరులు ఉన్నారు.

## నేడు బిసి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర బంద్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 17, ప్రభాతవార్త :** 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌చేస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు సంగారెడ్డి జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు, కుల సంఘాలు, యువజన సంఘాలు సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. సంగారెడ్డి జిల్లాలో చేపట్టే బందులో తమ తమ సంఘాల నాయకులు, కార్యకర్తలు, సభ్యులు అందరూ హాజరుకావాలని ఇప్పటికే పిలుపునిచ్చాయి. బందు శాంతియుతంగా జరిగే విధంగా ఇప్పటికే పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

## అధిక దిగుబడి విత్తనాలు అంటే..ఉన్న దిగుబడి పోయింది...

### విత్తనాలతో మోసపోయిన రైతులు

### నష్టపరిహారంతోపాటు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

### మెదక్ జిల్లా వ్యవసాధికారికి మొరపెట్టుకున్న రైతులు

**హవేలిఘనపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త**

అధిక దిగుబడులు వస్తాయని విత్తనాలు కొంటె ఉన్నదిగుబడి అంతా పోయిందని ఫరీద్పూర్ రైతులు కంట నీరు పెట్టారు మండలం పరిధిలోని ఫరీద్‌పూర్ గ్రామం రైతులు లక్ష్మీమెహర్ విత్తనాలు అధిక దిగుబడులు వస్తున్నాయని రైతులు ఆనందంతో తీసుకొని విత్తనాలు వేస్తే అధిక లాభాలు వస్తాయని పెట్టుబడి పెట్టి లాభం రాలేకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు గ్రామంలో పలువురు రైతులకు సంబంధించిన సుమారు 10 ఎకరాల్లో వరి పంట కోతకు వచ్చిన సమయంలో పూర్తిగా దెబ్బతిన్నది. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము లక్ష్మీ మెహర్ కంపెనీకి చెందిన వరి విత్తనాలను వాడటం వల్లే తాము తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో లక్ష్మీ మెహర్ కంపెనీ విత్తనాలు వాడిన రైతులందరి పొలాలు ఇలాగే జరిగాయన్నారు. నష్టపోయిన రైతులు జవాజి బ్రహ్మం దాసరి సిద్ధి రాములు జవాజి రాజు జి వెంకట రాములు సారా సిద్ధంలు జె శ్రీనివాస్ జి.సురేష్ జి.సంజీవులు కావున సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈవిషయం తెలుసుకున్న వ్యవసాయ అధికారులు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ మాట్లాడుతూ లక్ష్మీమెహర్ కంపెనీ వరి విత్తనాలను వాడటంతో పంట నష్టం వాటిల్లిందని రైతులు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ విషమై పొలాలను పరిశీలించామని, నష్టం ఎలా జరిగిందో ధ్రువీకరించాలంటే శాస్త్రవేత్తలు అవసరం ఉంటుందన్నారు. శాస్త్రవేత్తలకు సమాచారం అందించి, పంట నష్టానికి గల పూర్తి కారణాలను తెలుసుకొని శాస్త్రవేత్తల రిపోర్టుకు అనుగుణంగా రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పంటను చూపిస్తున్న రైతులు

# విద్యార్థి మృతిపై జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ విచారణ

## అనుమానం వున్న ప్రతి విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటాం.. జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 17, ప్రభాతవార్త**

మండలంలోని జిల్లెలగడ్డ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్‌కుమార్, కమిషన్ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి సనాదుల వివేక్ ఈ నెల 7వ తేదీన పాఠశాలలో అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన పై విచారణ సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, హుస్నాబాద్ ఎసిపి సౌదారపు సదానందంతోపాటు సంబంధిత అధికారులు, బాధిత తల్లిదండ్రులను, తరగతి విద్యార్థులను మూడు గంటలసేపు వేరు వేరుగా విచారించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, విద్యార్థి అనుమానాస్పద మృతి విషయంలో విచారణ నడుస్తుందని, పూర్తి నివేదిక ఇవ్వడానికి నెల రోజుల సమయం పడుతుందన్నారు. సంఘటన స్థలాన్ని కలెక్టర్, పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించడం జరిగిందని, అనుమానాస్పదంగా కనిపించిన ప్రతి విషయాన్ని పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. విచారణ అనంతరం దోషులను నిర్ధారించి రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగానికి పలు ఆదేశాలను జారీ చేశామని, వారు తీసుకునే చర్యలను గురించి వారం లోగా తెలియజేస్తామన్నారు. అలాగే హాస్టల్‌లో ఎక్కడైన లోటుపాట్లు ఉంటే తప్పకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న విద్యార్థి తల్లిదండ్రులు లావణ్య, సత్యనారాయణ వారికి తగిన న్యాయం చేయడంతో పాటు మరో విద్యార్థికి ఇలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవాలని కోరుతూ ఎస్సీ కమిషన్ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, సిఐ కొండ్ర శ్రీనివాస్, ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డితో పాటు మెడికల్ సూపరిండెంట్ రమేష్‌రెడ్డి, జాతీయ మాలమహానాడు నియోజకవర్గ ఇంచార్జ్ ఆరె కిశోర్ తో పాటు సంఘం ప్రతినిధులు ఉన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్‌కుమార్

# అందరి అభిప్రాయంతోనే డిసిసి అధ్యక్ష ఎన్నిక

## ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అబ్జర్వర్ జరిట లైత్ ప్లాయంగ్

**జహీరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:**

త్వరలో నియమించనున్న డిసిసి అధ్యక్ష ఎన్నిక జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు కొనసాగుతుందని ఏఐసిసి ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అబ్జర్వర్ జరిట లైత్‌ప్లాంగ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన డిసిసి అధ్యక్ష ఎన్నికపై నియోజకవర్గస్థాయి అభిప్రాయ సేకరణ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. సమావేనికి మీడియాను దూరంగా ఉంచారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ బి ఫాంలు ఇచ్చే డిసిసి అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైందని, బాధ్యతగల పదవికి అర్హత ఉండి పార్టీని విజయపథాన నడిపించే సత్తా ఉన్న నాయకులనే డిసిసి అధ్యక్షులుగా నియమిస్తామన్నారు. కార్యకర్తల అభిప్రాయం మేరకు 6 మంది పేర్లను ఏఐసిసికి పంపిస్తామని, ఏఐసిసి అధిష్టానం సూచనల మేరకు డిసిసి అధ్యక్షులను నియమిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్ రెడ్డిని డిసిసి అధ్యక్షులుగా నియమించాలని అబ్జర్వర్‌ను మాజీ మంత్రి, నియోజకవర్గ పార్టీ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ కోరినట్లు తెలుస్తోంది. సమావేశంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి గిరి ప్రీతం, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి, టిఎస్ఐడిసి మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, సిడిసి చైర్మన్ మోబిన్ అహ్మద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖండెం నర్సింలు, జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసింహారెడ్డి, మహమ్మద్ మక్సూద్, బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, పి రామలింగారెడ్డి, హనుమంతరావు పాటిల్, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐసిసి ప్రధాన కార్యదర్శి లైట్ ప్లాంగ్

# రాహుల్‌ను ప్రధానిని చేయడమే ప్రతి కార్యకర్త కర్తవ్యం

## కాంగ్రెస్ పార్టీ పరిశీలకురాలు జ్యోతి రౌతేలా

**గజ్వేల్/వర్గల్, అక్టోబరు 17 (ప్రభాతవార్త):** రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే ప్రతి కార్యకర్త కర్తవ్యమని ఆ పార్టీ పరిశీలకులు జ్యోతి రౌతేలా పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్, వర్గల్ మండల కేంద్రాల్లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర కో-ఆర్డినేటర్లు జగదీశ్వర్‌రావు, నజీర్‌అహ్మద్, వరలక్ష్మి, సంతోష్‌గుప్త, డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డితో కలిసి ప్రసంగించారు. పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని కోరారు. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, ఖర్గే ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీల నియామకం చేపడుతుండగా, ప్రతి కార్యకర్తలతో వ్యక్తిగతంగా మాట్లాడి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. దేశంలో నరేంద్ర మోడి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుండగా, కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో దోచుకోవడం, దాచుకోవడానికి పరిమితమైన గత ప్రభుత్వం ఖజానాను దివాలా తీయించిందని అన్నారు. త్యాగాలు కాంగ్రెస్ పార్టీకే సాధ్యపడుతుండగా, దివంగత ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దేవం కోసం ప్రాణాలర్పించినట్లు గుర్తు చేశారు. పార్టీ శ్రేణులు క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి కార్యకర్త కాంగ్రెస్ కుటుంబ సభ్యులేనని తెలిపారు. రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు క్రిందిస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, సీనియర్ నాయకులు మడుపు భూంరెడ్డి, గజ్వేల్ మార్కెట్‌కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, ఏఎంసి వైస్ చైర్మన్లు సర్దార్‌ఖాన్, ప్రభాకర్‌గుప్త, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సలీం, మాజీ ఎంపిపి ఉపాధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, నాయకులు రమేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పోషిరెడ్డి, తమ్మలి శ్రీనివాస్, వేమారెడ్డి, ప్రభుదాస్‌గౌడ్, కొన్యాల బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జ్యోతి రౌటేలా

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

## సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**చౌటకూరు, అక్టోబరు 17, ప్రభాతవార్త:**

ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని తాడ్దాన్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను, సుల్తాన్‌పూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, పిల్లలకు సురక్షిత వాతావరణం కల్పించాలన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ సబ్జెక్టుల్లో వెనుబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న తీరుపై ఆరా తీశారు. సుల్తాన్‌పూర్ పాఠశాలలో విద్యార్థులకు వండిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి హామి ఇచ్చారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ లబ్దిదారులకు, అధికారులకు సూచించారు. ఇంటి నిర్మాణాలకు అనుగుణంగా బిల్లులు అందుకుంటారని లబ్దిదారులకు సూచించారు.



సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

**విశ్లేషణాత్మక విద్యతోనే ఉన్నత శిఖరాలకు విద్యార్థులు...**

విద్యార్థులు విశ్లేషణాత్మకంగా విద్యను అందుకుంటేనే ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సుల్తాన్‌పూర్‌లోని జేఎన్టీయూ కళాశాలలో నిర్వహించిన కేరీర్ గైడెన్స్ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులన ఉద్దేశించి ప్రసంగించారు. సివిల్ సర్వీస్ కేవలం పరీక్ష కాదని, అది దేశ సేవకు దారితీసే అవకాశమని, అందుకు విద్యార్థులు సివిల్ పరీక్షల విధానం పేపర్ నమూనా, సబ్జెక్టుల ఎంపిక, సమాధానాలు రాయడంలాంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. యూపీఎస్సీ, గ్రూప్స్ లాంటి పోటీ పరీక్షల్లో రాణించేలా విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అందుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్‌డిఓ పాండు, తహసీల్దార్ కిష్టయ్య, ఎంపిడిఓ కె.శంకర్, ఆర్ఐ ప్రదీప్‌కుమార్, జెఎన్‌టియు ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఆయా విభాగాల అధ్యాపకులు, గృహ నిర్మాణ శాఖ ఏఈ శ్రీదేవి, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు పావని, సిద్దమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

### చెరువులలో చేప పిల్లలు విడుదలకు

## చర్యలు చేపట్టాలి : కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ అక్టోబరు 17 ప్రభాతవార్త**

జిల్లాలో చేపల ఉత్పత్తి పెంపుతో పాటు మత్స్యకారుల ఆర్థిక స్థితి మెరుగుపరచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని నీటిమనరులైన చెరువులో కుంటలు ప్రాజెక్టులలో చేప పిల్లలు విడుదలకు చేయాల్సిన ఏర్పాట్లపై సన్నాహక సమావేశం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, మత్స్యశాఖ అధికారి మధుసూదన్, నీటి పారుదలశాఖ అధికారి జనార్దన్, డిపిఓ సాయిబాబాతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చెరువులలో చేప పిల్లల విడుదల ద్వారా మత్స్యకారులకు ఆర్థికంగా ప్రయోజనం కలగడంతోపాటు వారి జీవన విధానం బలోపేతం అవుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 1025 సీజనల్ చెరువులు, 79 దీర్ఘకాలంగా నీరునిల్వ ఉండే చెరువులు ఉన్నాయని, వీటిలో సింగూరు ప్రాజెక్టు, సదాశివపేట మండలం, తంగడపల్లి నీలగిరి ప్రాజెక్టులు, నారాయణఖేడ్ డివిజన్, పరిధిలోని సిర్గాపూర్ మండలం లోని నల్లవాగు ప్రాజెక్టులలో చేప పిల్లల విడుదలకు అనుకూలమైన నీటి వనరులు పుష్కలంగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. చేప పిల్లల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. మత్స్యశాఖ అధికారులు క్వాలిటీ చెక్ ప్రక్రియను ఖచ్చితంగా పాటించాలని, నాణ్యమైన చేపపిల్లలే చెరువుల్లో విడుదల చేయాలన్నారు. ఎంపీడీవోలు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసి, ప్రతి పంచాయతీ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించి ఈ కార్యక్రమం విజయవంతం కోసం కృషి చేయాలన్నారు. పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ మత్స్యశాఖల అధికారులు బాధ్యతగా సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి బంద్‌కు కాంగ్రెస్, బిఆర్ఎస్ మద్దతు

**హత్నూర, అక్టోబరు 17, ప్రభాతవార్త:** బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు బిఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షుడు కర్రె కృష్ణ శనివారం వేరు, వేరు ప్రకటనలో తెలిపారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే బంద్ లో



యువతి నుంచి వివరాలను తెలుసుకుంటున్న సైబర్‌క్రైమ్ కానిస్టేబల్

## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో యువతి

### ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం చేసిన కేటుగాళ్లు

**జహీరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** ఇన్‌స్టాగ్రామ్‌తో పరిచయమైన యువతిని ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు గుంజుకుని సైబర్ నేరానికి గురైన యువతి ఉదంతం ఇది. పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో జరిగిన సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్ మండలం అబ్బెంద గ్రామానికి చెందిన బిరాదార్ భాగ్యశ్రీ భర్త కృష్ణతోకలిసి హైదరాబాద్‌లోని బోరబండలో ఉంటూ ఆప్టెల్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఉద్యోగం ఇప్పిస్తానని ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తి భాగ్యశ్రీ నుంచి మొదట కంపెనీ ఐడెంటిటీ అంటూ రూ. 850 తీసుకుని రైల్వే కౌంటర్ ఉద్యోగం ఇస్తూ డూప్లికేట్ ఐడెంటిటి కార్డును తయారు చేసి పంపించాడు. కొన్ని రోజులకు ఉద్యోగ అప్లికేషన్ వెరిఫికేషన్ అంటూ రూ. 15000 కావాలని పేర్కొనగా భాగ్యశ్రీ రెండు విడుతల్లో ఫోన్‌పే ద్వారా చెల్లించుకుంది. ఉద్యోగం విషయమై భాగ్యశ్రీ అడగ్గా జిఎస్టి కొరకు మరో రూ. 5 వేలు పంపమని సూచిస్తూ ఉద్యోగం కాల్‌లెటర్‌కు జహీరాబాద్ రైల్వే స్టేషన్‌కు రావాలని సూచించగా భాగ్యశ్రీ తన తాతను వెంటపెట్టుకుని శుక్రవారం రైల్వేస్టేషన్‌కు ఉదయం చేరుకుని సమాచారం ఇచ్చిన వ్యక్తి కోసం ఎదురు చూస్తూ ఎంతకూ రాకపోవడంతో స్టేషన్‌మాస్టర్ మాధవ కృష్ణకు విషయాన్ని భాగ్యశ్రీ వివరించగా భాగ్యశ్రీ సైబర్ నేరానికి గురైందని గ్రహించి సదరు వ్యక్తికి ఫోన్ చేసినా ప్రయోజనం లేకపోవడ తో జహీరాబాద్‌లోని సైబర్ క్రైమ్ కానిస్టేబుల్‌కు సమాచారం అందించగా కానిస్టేబుల్ స్టేషన్‌కు చేరుకుని భాగ్యశ్రీ నుంచి వివరాలు సేకరించారు.

## సింగూరులో వేటకు వెళ్లిన మత్స్యకారుడి గల్లంతు

**పుల్‌కల్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు సింగూరు డ్యాంలో గల్లంతైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విశ్వజన్ కథనం ప్రకారం... సదాశివపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన దాసరి కుమార్(36) కుటుంబ సభ్యులతో కలిసి కొంత కాలంగా సింగూరు గ్రామంలో నివాసం ఉంటున్నారు. సింగూరు ప్రాజెక్టులో చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడన్నారు. గురువారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ప్రాజెక్టులో వలలు వేసి శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో వలల్లో చిక్కుకున్న చేపలను తెచ్చుకునేందుకు ప్రాజెక్టు నీటిలోకి దిగి నీటిలో గల్లంతయ్యాడన్నారు. చేపలవేటకు వెళ్లిన కుమార్ ఎంతకూ ఇంటికి చేరుకోకపోవడంతో ప్రాజెక్టులో గల్లంతయినట్లు తెలుసుకుని ఆచూకి కోసం పోలీసులు, స్థానిక మత్స్యకారుల సహాయంతో గాలింపు చేస్తున్నారు. కుమార్ భార్య దాసరి భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వజన్ వివరించారు.

## రిజిస్ట్రేషన్ కార్యాలయ సమీపంలో చోరీ

**కంది, అక్టోబరు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయ సమీపంలో శుక్రవారం పట్టపగలు దొంగతనం జరిగింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... పటాన్‌చెరు మండలం బీరంగూడ గ్రామానికి చెందిన ఎల్లబోయిన శ్రవణ్‌కుమార్ టిఎస్ 02ఈహెచ్1123 ఫోర్డ్ ఫిగో కారులో 1లక్ష 50వేల రూపాయలను ఉంచి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాడు. సాయంత్రం కార్యాలయంలో పనులు ముగించుకుని మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో కారులోకి వచ్చి చూడగా కారు అద్దాలు పగలగొట్టి కారులో ఉన్న లక్ష 50వేల రూపాయలను తస్కరించినట్లు గుర్తించాడు. చోరీ జరిగిన విషయాన్ని ఇంద్రకరణ్ పోలీసులకు ఫిర్యాదు చేయడం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## అయ్యప్ప దేవాలయం ఒక ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుంది

-ఎమ్మెల్యే సునీతారెడ్డి



దేవాలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప దేవాలయం నర్సాపూర్ నియోజకవర్గానికి ఒక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె నర్సాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప దేవాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సునీతారెడ్డితోపాటు అయ్యప్ప దేవాలయ కమిటీ చైర్మన్ దుర్గప్పగారి అశోక్ గౌడ్ కలిసి అయ్యప్ప దేవాలయ గర్భగుడి, మండపం, హాల్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సాపూర్‌లో నిర్మిస్తున్న అయ్యప్ప దేవాలయం ఒక దివ్యక్షేత్రంగా విరాజిల్లుతుందన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ దుర్గాప్పగారి అశోక్‌గౌడ్, జిల్లా మాజీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, మండలపార్టీ అధ్యక్షుడు భోగ శేఖర్, వెల్దుర్తి మండల మాజీ జడ్పిటిసి రమేష్‌గౌడ్, అయ్యప్పస్వామి ఆలయకమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బివిఆర్ఐటిలో జాతీయస్థాయి సృజనాత్మకత ఆవిష్కరణ ప్రతిభాపోటీలు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు తదితరులు

**నర్సాపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఆసరా 2025 జాతీయస్థాయి ఇంజనీరింగ్ సృజనాత్మకత, ఆవిష్కరణల ప్రతిభ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్‌దూబే తెలిపారు. శుక్రవారం ఆసరా 2025 జాతీయస్థాయి ఆవిష్కరణల పోటీలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్‌దూబే ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్ దూబే మాట్లాడుతూ ఈ జాతీయస్థాయి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమం గ్రానియల్ ఇండియా, అపతోరియా ఫార్మా, వసంత్ కెమికల్స్ నకోడా కెమికల్స్, తదితర లిమిటెడ్ సంస్థలు స్పాన్సర్ చేశాయన్నారు. ఈ జాతీయస్థాయి పోటీలు కళాశాల మేనేజర్ బాపిరాజు, టిఎల్ఎన్ సురేష్, ఏవోల పర్యవేక్షణలో విజయవంతంగా కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో కళాశాలల వివిధ విభాగాధిపతులు, ఫ్యాకల్టీ మెంబర్స్, డిపార్ట్మెంట్స్ అధ్యాపకులు, డీన్స్, హెచ్ఓడిలు విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## గవాయిపై దాడిచేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**కంగ్టి, అక్టోబరు, 17, ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై దాడికి యత్నించిపై వ్యక్తిపై కఠినచర్యలు తీసుకోవాలని జిల్లా మాదిగ జర్నలిస్టు సంఘం అధ్యక్షులు విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. శుక్రవారం కంగ్టి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దాడి వెనక ఉన్న శక్తులను కూడా గుర్తించాలని, సుప్రీం సీనియర్ జడ్జిలతో విచారణ జరిపించాలని డిమాండ్‌చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినచర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో బాబుమాదిగ, రమేశ్‌మాదిగ, లక్ష్మణ్, భీమన్న, దయానంద్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర బంద్‌కు ప్రజలు సహకరించాలి: బిఆర్ఎస్

**టేక్మాల్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్ర బిసి బంద్‌కు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా సహకరించాలని జిల్లా యువతకార్యదర్శి నాయికోటి భాస్కర్ వ్యాపారస్థులను, ప్రజలను కోరారు. సాధ్యంకాని జీవోలతో బిసిలను మభ్యపెడుతున్నారని, కాంగ్రెస్ బిసిలకు ఇచ్చిన హామీ ప్రకారం తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. రాష్ట్రంలో బిసి వర్గాలకు 42శాతం స్థానికసంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించని వైఖరిని నిరసిస్తూ జీవో 9 ఆర్డినెన్సుపై రాష్ట్ర హైకోర్ట్ స్టే విధించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని బిసి సంఘాలు ఐక్యంగా ఈనెల 18న రాష్ట్ర బంద్‌కు పిలుపును ఇచ్చిన నేపథ్యంలో, ఈబంద్‌కు బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని జిల్లా యువత కార్యదర్శి భాస్కర్ కోరారు.

## రిజర్వేషన్ల బంద్ విజయవంతం చేయండి

-జిల్లా బిసి ఐక్యవేదిక కన్వీనర్ దిగంబరరావు

**నర్సాపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయుటకై ఈనెల 18న బిసి ఐక్యవేదిక తలపెట్టిన బిసి బంద్‌ను విజయవంతం చేయాలని జిల్లా బిసి ఐక్యవేదిక కన్వీనర్ మన్నె దిగంబర్‌రావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బిసిలకు స్థానికసంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని అసెంబ్లీలో సైతం బిల్లు ప్రవేశపెట్టి అన్ని పార్టీల మద్దతుతో బిసి బిల్లు ఆమోదించాయి అన్నారు. కాగా కొందరు బిల్లుకు వ్యతిరేకంగా హైకోర్టులో కేసు వేయడం వల్ల బిల్లు నిలిచిపోయిందన్నారు. ఈ మేరకు బిసిలకు అన్నిపార్టీలతో కలిసి కేంద్ర ప్రభుత్వం ద్వారా రాజ్యాంగ సవరణ చేస్తూ బిసి రిజర్వేషన్లు బిల్లును సాధించాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 18న బిసి బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈబంద్‌కు నర్సాపూర్ పట్టణంలోని అన్నిపార్టీ బిసి నాయకులు, విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలు సహకరించి విజయవంతం చేయాలని దిగంబర్‌రావ్ కోరారు.

## నేటి బిసి బంద్‌కు పిలుపు

**కొండాపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** నేటి బిసి బంద్‌ను కొండాపూర్ మండలంలో విజయవంతం చేయాలని బహుజనసేన స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ దప్పు రాజు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు హైకోర్టు స్టే విధించడంపై శనివారం తెలంగాణ రాష్ట్ర బంద్‌కు బిసిసంఘాల జెఏసి పిలుపు నివ్వడంతో మండలంలో బిసి బందును విజయవంతం చేయాలని బహుజనసేన స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ దప్పు రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని మల్కాపూర్ శివారులో ఈనెల 18న తలపెట్టిన. బంద్ విజయవంతంపై ఏర్పాటు చేసిన సమావేశంలో దప్పు రాజు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో వడ్ల కాశిరామ్, కుమ్మరి దశరథ్, దుర్గేష్ పాల్గొన్నారు.

# నిర్మాణ పనులు పూర్తయిన మున్సిపల్ భవన కాంప్లెక్స్

## -ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నర్సాపూర్ మున్సిపల్ భవనం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నర్సాపూర్ నూతన మున్సిపల్ భవనం దృశ్యం

**నర్సాపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయానికి సొంత భవనం లేకపోగా నర్సాపూర్ పట్టణంలోని మహిళామండలి భవనంలో ఇరుకుగదుల్లో మున్సిపల్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. మున్సిపల్ నూతన భవనానికి శ్రీకారం చుట్టి నర్సాపూర్ ఐబి సమీపంలో నిర్మాణం చేపట్టారు. మొదటగా ఐదు కోట్ల నిధులతో నిర్మాణపనులు ప్రారంభించి నిధులు ఉన్నంతవరకు నిర్మాణ పనులు జరిపించగా నిర్మాణ పనుల్లో కొంతమేర ఆలస్యం జరిగింది. ఈ మేరకు కాంట్రాక్టర్‌కు ఈనిధులు సరిపోకపోవడంతో తదుపరి రెండో విడతగా మూడు కోట్లు విడుదల కాగా ఎట్టకేలకు మున్సిపల్ నూతన భవనం నిర్మాణ పనులు పూర్తిచేశారు. ఈమేరకు అన్ని హంగులతో నిర్మాణపనులు పూర్తయ్యి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. విశాలమైన ఈనూతన మున్సిపల్ భవనం రెండంతస్తులుగా నిర్మించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ నూతన మున్సిపల్ భవనాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డిని అడగగా భవన నిర్మాణ పనులు పూర్తయినందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీలైనంత త్వరలో ఈ నూతన మున్సిపల్ భవనాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఈనూతన భవననిర్మాణంతో మున్సిపల్ అధికారులకు, సిబ్బందిలకు సౌకర్యం ఏర్పడి ఇబ్బందులు తీరనున్నాయని మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి తెలిపారు.

## న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తంచేస్తున్న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త:** భారత సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గావాయ్‌పై న్యాయవాది కిషోర్ కుమార్ దాడిచేయడం న్యాయవ్యవస్థకే తీరనిమచ్చని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు మండిపడ్డారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తంచేశారు. అనంతరం తహసీల్దార్ మాలతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వికలాంగులహక్కుల పోరాటసమితి నాయకులు పాండు, మురళి, స్వరూప సిద్ధిరాములు, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో దంతపరీక్షలు

**సిద్ధిపేట రూరల్(చిన్నకోడూరు), అక్టోబరు 17, ప్రభాతవార్త:** నోరు శుభ్రంగా లేకపోతే అనారోగ్యానికి దారితీస్తుందని నోరు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని ప్రముఖ తెలంగాణ డెంటల్ ఆసుపత్రి వైద్యులు అరవింద్‌కుమార్ అన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ టిఎస్ మోడల్‌స్కూల్‌లో శుక్రవారం తెలంగాణ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 430మంది విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించి దంత పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను, టూత్‌పేస్ట్, బ్రష్‌లను పంపిణీచేసి దంత సమస్యలు, చిగుళ్ల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సతీష్‌కుమార్, వైద్యులు స్పందనరాణి, నవీన్, రమాదేవి, దీప్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యం



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ టీచర్లు

**వర్గల్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** గర్భిణీస్త్రీలు, బాలింతలు, తల్లులు మంచిపోషకాలు ఉన్న ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అంగన్వాడీ టీచర్లు రామలీల, సంతోషలు తెలిపారు. శుక్రవారం వర్గల్‌మండలం గౌరారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్వాడీ టీచర్లు గర్భిణీస్త్రీలకు, బాలింతలకు, తల్లులకు పోషకాహారంపై అవగాహనకల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎన్ఎం మాణిక్యం, ఆశాలు లత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది

-కౌన్సిలర్ కాటం శోభరాఘురామ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

**సిద్ధిపేట రూరల్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని 42వ వార్డు స్పైస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల నాయకుడు, నాయకురాలుకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ కాటం శోభరాఘురామ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో ఓటు ప్రాధాన్యతపై వివరించారు. విద్యార్థులు తమ ఓటు హక్కును ఎంతో ఉత్సాహంగా వినియోగించుకున్నారని తెలిపారు. ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత గెలిచిన హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌లను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీకాంత్‌రెడ్డి, రాజారెడ్డి, రవి, న్యూ విజేత రవి, భీష్మాచారి, శశిధర్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బంద్ విజయవంతం చేయాలి

-బిసి సంక్షేమసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సాప రవి

**హవేలీఘనపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్ మద్దతుగా అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని బిసి సంక్షేమసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సాప రవి కోరారు. ఈసందర్భంగా హవేలిఘనపూర్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం 42శాతం బిసి రిజర్వేషన్ అమలుకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని, రాష్ట్రంలో బిసిలకు అన్యాయం జరుగుతుందని, 42 శాతం బిసి రిజర్వేషన్‌కు న్యాయస్థానాల్లో కాలయాపన చేయడంతో ఇటు బిసిలు, అటు ఆశావహులు అయోమయంలోపడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి 42శాతం రిజర్వేషన్ అమలుచేయాలని డిమాండ్‌చేశారు.

## బిసిల హక్కుల సాధనకు మద్దతు తెలుపుతూ బంద్‌ను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే

**సదాశివపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త:** బిసివర్గాల హక్కుల సాధనకోసం ఈనెల 18వ తేదీన చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌కు బిఆర్ఎస్ పార్టీ మద్దతు ప్రకటించిందని, జిల్లా ప్రజలు బంద్‌ను విజయవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. 42శాతం బిసి రిజర్వేషన్ అమలుకు రాష్ట్ర వ్యాప్త బంద్ ఒక శాంతియుత నిరసన రూపమన్నారు. ప్రజలు, వ్యాపార వేత్తలు, విద్యార్థులు, సంఘాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని బిసి సమాజ ఐక్యతను చాటాలని ఆయన అభిప్రాయపడ్డారు. బిసిల సమస్యలు పరిష్కార మయ్యేవరకు తమమద్దతు కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## మానసిక నైపుణ్యంపై విద్యార్థులకు అవగాహన




అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న నిపుణులు

**హత్నూర అక్టోబరు 17, ప్రభాతవార్త:** హత్నూరమండలం సిరిపురంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో శుక్రవారం మానసిక నైపుణ్యంపై నిపుణులు విజయ్ జాకోజీ, రాజేశ్వర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రేరణాత్మక రాతపూర్వక నైపుణ్యంలో మెళకువలు నేర్పించారు. దీనితోపాటు లయన్స్ క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో స్థానికులు ఆందోల్ పోచయ్య స్కూల్లో శౌచాలయం కొరత ఉండటం వల్ల లక్ష రూపాయలతో శౌచాలయం పునర్నిర్మాణం చేయడం ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, హెచ్ఎం మంజుల, మాజీసర్పంచ్ నరేందర్, స్థానికులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలి

-రౌండ్‌టేబుల్ సమావేశంలో బిసి నాయకులు



అంబేద్కర్ చౌరస్తాలో నినాదాలు చేస్తున్న బిసిసంఘాల నాయకులు

**గజ్వేల్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేస్తూ పార్లమెంట్‌లో చట్టంచేయాలని బిసినాయకులు డిమాండ్‌చేశారు. శుక్రవారం గజ్వేల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్‌సమావేశంలో వారు మాట్లాడుతూ జనాభాలో 60శాతం ఉన్న బిసిలకు కేవలం 27శాతం మాత్రమే రిజర్వేషన్లు ఉన్నాయని, దీంతో అన్నిరకాలుగా బలహీనవర్గాలు వెనుకబడ్డాయని అన్నారు. అంతకుముందు స్థానిక అంబేద్కర్‌చౌరస్తాలో పలు నినాదాలుచేశారు. కార్యక్రమంలో బిసిసంఘాల నాయకులు నర్సింగరావు, శ్రీను, రామచంద్రం, రాజేశం, ఎల్లయ్య, సందబోయిన ఎల్లయ్య, కన్నయ్య, మోహన్‌బాబు, ప్రవీణ్, రమణాకర్, వినోద్, చిప్పల యాదగిరి, మైస రాములు, పొన్నాల కుమార్, బింగి స్వామి, మరాటి కృష్ణమూర్తి, గంగిశెట్టి రాజు, బాకి స్వామి, బొంది స్వామి, తుమ్మ శ్రీనివాస్, కృష్ణ, ఆంజనేయులు, ఐలయ్య, సురేష్, శ్రీనివాస్, శ్రీధర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# కోళ్ల ఫారంపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా

## -రోడ్డుపై బైఠాయించిన కాగజ్ మద్దూర్ గ్రామస్థులు



కోళ్ల ఫారంపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నాచేస్తున్న కాగజ్‌మద్దూర్ గ్రామప్రజలు

**నర్సాపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** నర్సాపూర్ మండల పరిధిలోని కాగజ్ మద్దూర్ గ్రామంలో ఉన్న కోళ్ల ఫారం నుండి దుర్వాసన వస్తూ మురికినీళ్లు వదులుతున్నారంటూ ఆరోపిస్తూ కాగజ్ మద్దూర్ గ్రామస్థులు శుక్రవారం కోళ్ల ఫారం గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోళ్ల ఫారం నుండి దుర్వాసన వెదజల్లుతుండడంతో ముందర గల జడ్‌పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. అదే విధంగా ఈ కోళ్ళ ఫారంలో నుండి మురికి నీరు వదలడంతో బయటకు వచ్చిన నీరంతా కలుషితమై దుర్వాసన వెదజల్లుతుండటం వల్ల అటుగా పోయే ప్రజలు ఎన్నో ఇబ్బందులు అవస్థలు పడుతున్నారన్నారు. కోళ్ల ఫారం నుండి వచ్చే దుర్వాసన వల్ల విద్యార్థులు, గ్రామప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని వారు తెలిపారు.

ఈమేరకు అధికారులు స్పందించి వెంటనే ఈ కోళ్ల ఫారం యజమానిపై తగిన చర్యలు తీసుకొని దుర్వాసన వెదజల్లే మురికినీరు రాకుండా చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ఈ ఆందోళన కార్య క్రమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామప్రజలు తది తరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు మరమ్మతులు

**జిల్లేడు చౌదరిగూడెం, అక్టోబరు 17 (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని లాల్‌పహాడ్ నుంచి జాకారం వరకు ఉన్న బీటి రోడ్డును కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మరమ్మత్తులు చేశారు. గత కొన్ని రోజుల కిందట కురిసిన వర్షానికి రోడ్డు పక్కన గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని స్థానికి నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకువెల్లారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు మరమ్మత్తులు చేయించాలని ఆదేశించారు. ఈ మెరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మరమ్మత్తు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపిటిసి సత్యనారాయణరెడ్డి, మాజి సర్పంచ్ శివమౌళి, జగన్‌మోహన్ రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, రాధకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన మండల అధ్యక్షుడు

**జిల్లేడు చౌదరిగూడెం, అక్టోబరు 17 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో ముగ్గురు పిల్లల నిబంధనను తొలగిస్తున్నట్లు ప్రకటించడంపట్ల ఆ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను శుక్రవారం సన్మానించారు. గ్రామాలలో పోటి ఎన్నికలలో పోటిచేసేందుకు ఉత్సహం ఉన్నవారికి ముగ్గురు పిల్లలు ఉండడం వల్ల కొంత ఇబ్బందులు పడ్డారని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ నిబంధనను తొలగించడం వల్లన ఎంతో మందికి ఎన్నికలలో పోటి చేసేందుకు అవకాశం వచ్చిందని ఆయన పెర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత కుట్టుమిషన్ శిక్షణ

**కొత్తూరు, అక్టోబరు 17, ప్రభాతవార్త;** కొత్తూరు మండలంలో జన శిక్షణ సంస్థాన్ రంగారెడ్డి జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఎంట్రాపూన్యూర్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం మరియు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సంస్థ కొత్తూర్ మున్సిపల్ మరియు మండలంలోని గ్రామాలలో ఉచిత కుట్టు మిషన్ నేర్పించడం జరిగింది. ఈ ఉచిత కుట్టు మిషన్ కోర్సు 80 రోజుల కోర్సు దీనిలో 40 మంది మహిళలు కుట్టుమిషన్ నేర్చకోవడం, కుట్టు మిషన్ నేర్చుకున్న వారికి శుక్రవారం. పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ పరీక్ష కేంద్రంలో ముఖ్య నాయకులు డైరెక్టర్ రామ్మోహన్ రావు , కౌన్సిలర్ హేమ దేవేందర్ ముదిరాజ్. కౌన్సిలర్ మాధవరం నరసింహ గౌడ్, స్థానికులు జనార్దన్ రెడ్డి పేపర్ యాదయ్య పాల్గొన్నారు. మహిళలకు శిక్షణ ఇచ్చినవారు గీత మహిళలకు శిక్షణ ఇచ్చారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి అక్టోబరు 17,ప్రభాత వార్త:** తలకొండపల్లి మండలంలోని దేవునిపడకల్ గ్రామానికి చెందిన కాడమోని గంగమ్మ (58), శుక్రవారం ఉదయం మృతి చెందారు .ఈ విషయంతెలుసుకున్న ,తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తన ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా బాధిత కుటుంబానికి సహాయముఅందజేశారు. ఈ విషయాన్ని తలకొండపల్లి తీళిళీ పార్టీ మండల అధ్యక్షులు కుమ్మరి శంకర్ ద్వార తెలుసుకొని స్థానిక స్పందించి తక్షణమే 3000/ రూపాయలు తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన తో పాటుదేవునిపడకల్ వాలీబాల్ యూత్ ప్రెసిడెంట్ కుమ్మరి మల్లేష్ గారు తనవంతుగా 3000/ అందించారు, ఈకార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు అంబటి రమేష్. అంబటి లింగయ్య. మాజీ సర్పంచ్ శంకర్ నాయక్. అంబటి లక్ష్మయ్య. అంబటి వెంకటేష్. అంబటి జంగయ్య. గుంటి గౌరీశంకర్. కడమోని నర్సింహా. మరియు గ్రామ నాయకులు కలిసి కుటుంబ సభ్యులకు అందజేశారు .

## కెవిసిఎస్‌లో వైభవంగా దీపావళి సంబురాలు

**తాండూరు, అక్టోబరు 17, ప్రభాతవార్త :** తాండూరు పట్టణంలోని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌లో ముందస్తుగా దీపావళి సంబరాలను వైభవంగా జరుపుకొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్‌కుమార్, డైరెక్టర్ సతీష్ కుమార్‌లు పాఠశాలలో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులు దీపావళి పండగ విశిష్టతను వివరించారు. దీపావళి....చీకట్లను పారదోలి వెలుగుల్ని ప్రసాదించే దీపాల కాంతుల పర్వదినం.. దీపావళి పండుగను అత్యంత వైభవంగా జరుపు కొంటామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుల పర్యవేక్షణతో విద్యార్థులచే దీపాలను వెలిగిస్తూ టపాసులను అంటిస్తూ సంబురాలు చేసుకున్నారు. పెద్దఎత్తున టపాసులు, భూచక్రాలు, తారాజువ్వలు, కాకర పువ్వొత్తులు కాలుస్తూ అట్టహాసంగా దీపావళి వేడుక లను జరుపుకొన్నారు. కార్యక్రమంలో భాగంగా చెడుపై మంచి విజయానికి ప్రతీకగా నరకాసురుడి దిష్టిబొమ్మను దహనం చేస్తూ కార్యక్రమాన్ని ముగించారు.

## అక్రమ మెడిసిన్ దందాపై సమాచారం ఇవ్వాలి

**కొండగల్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** ఇటీవలే పెరిగిపోతున్న మత్తు మందులు, అక్రమ మెడిసిన్ దందాను అరికట్టేందుకు ప్రజలే ముందుకు రావాలని శేరిలింగంపల్లి జోన్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.అనిల్‌కుమార్, డ్రగ్ ఇన్సిపెక్టర్ ఎ.ఎన్.క్రాంతికుమార్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు కొడంగల్‌లో పత్రిక ప్రకటన విడుదల మత్తు మందుల(ప్రిస్క్రిప్షన్ మందుల) దుర్వినియోగం, ఇతరమందులకు సంబంధించిన చట్టవిరుద్ధ కార్యకలాపాలను తెలియజేయడంద్వారా ప్రజారోగ్యాన్ని రక్షించేందుకు సహకారం అందించాలన్నారు. మెడిసిన్ దందాపై ఫోన్‌కాల్‌లో చెప్పాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేయుద్ధంలో పౌరులే కీలకమని అన్నారు. మీ పరిసరాల్లో, జనావాసాల్లో, ఇతరాత్ర ప్రాంతాల్లో ఎక్కడైనా మత్తుమందులు తయారు చేస్తున్నా, డాక్టర్ చీటీ లేకుండా అబార్షన్ కిట్స్, నిద్రమాత్రలు తదితర వాటిని విక్రయిస్తున్నా, ఇతర అనుమానాస్పద యాక్టివిటీస్ కనిపించినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మెడిసిన్ అక్రమ దందాపై ఫిర్యాదు చేసేందుకు 18005996960 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని సూచించారు.

## అప్పాయిపల్లిలోనే మెడికల్ కళాశాలను నిర్మించాలి

**కొండగల్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** మండలంలోని అప్పాయిపల్లికి కేటాయించిన మెడికల్, వెటర్నరీ, నర్సింగ్ కళాశాలలు అప్పాయిపల్లిలోనే నిర్మించాలని ప్రధాన డిమాండ్‌తో అప్పాయిపల్లి మెడికల్ కళాశాల అభి వృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యచరణ కమిటీ(ఏఎండిపి,జేఏసీ) ఆధ్వర్యంలో మేము సైతం అప్పాయిపల్లి అభివృద్ధి కోసం శాంతియుత నిరసన దీక్ష చేపట్టారు. శుక్రవారం అప్పాయిపల్లి(ఎర్రన్‌పల్లి) గ్రామస్థులు, గ్రామంలో విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు, విద్యావంతులు ర్యాలీ నిర్వహించి మా గ్రామానికి కేటాయించిన మెడికల్, వెటర్నరీ, నర్సింగ్ కళాశాలలను ఇక్కడే నిర్మించాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షకు కేడిపి, జేఏసీ, ఉడిమేశ్వరం గ్రామస్థులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కెడిపి. జేఏసీ కోకన్వీనర్ ఎర్రన్‌పల్లి శ్రీనివాస్, సలహదారులు గంటి సురేష్‌కుమార్, రమేష్‌బాబు, మధుసుదన్‌యాదవ్, వెంకట్రామ్‌రెడ్డి, మాసాని వెంకటయ్య, భీమ్‌రాజ్, శివకుమార్, వెంకటయ్య, ఉడిమేశ్వరం మధు తదితరులు మాట్లాడుతూ అప్పాయిపల్లి 19 సర్వే నంబర్ రైతుల దగ్గర నుండి మెడికల్, వెటర్నరీ, నర్సింగ్ కళాశాలలు నిర్మిస్తామని భూమి తీసుకొని పనులు మొదలుపెట్టి ఇక్కడి ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వేరే ప్రాంతానికి కళాశాలలను తరలించడంతో ఈప్రాంత ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇందుకుగాను మెడికల్, వెటర్నరీ, నర్సింగ్ కళాశాలలను ఇక్కడే నిర్మిస్తే, ఈప్రాంత అభివృద్ధికి మీరిచ్చిన వరంగా భావిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ దత్తుసింగ్, మ్యాతరి సంగప్ప, ఉపసర్పంచ్ మల్లప్ప, దొబ్బలి పకీరప్ప, గోకుల్‌సింగ్, గుడిసె వెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**కీసర, అక్టోబరు 17, ప్రభాతవార్తః** 11 కెవి ఫీడర్ వల్ల నేడు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కీసర మండల విద్యుత్ ఏఈ మురళీక్రిష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు శనివారం రాంపల్లి ఎస్ఎస్‌నుండి మద్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు రాంపల్లి పాత గ్రామం, సాహితి హరహర వెంట్యూట్, శుభం ఎన్‌క్లేవ్, జై భవానీ కాలనీ, సాయిబాబానగర్ కాలనీ, లక్ష్మీనగర్, విఎస్‌టి కాలనీ, అయ్యప్ప కాలనీ, రోజ్ గార్డెన్, నీల్గిర్ ఎన్‌క్లేవ్, సిరి ఎన్‌క్లేవ్, సిలికాన్ మెడోస్, ఎలిఫెంట్ ఎన్‌క్లేవ్, ఎన్ఎస్ఆర్ లోటస్ కౌంటీలలో విద్యుత్ సరఫరాలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

## రాయితీపై మొక్కజొన్న విత్తనాల పంపిణీ

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** జాతీయ ఆహార భద్రత పోషణ మిషన్ పథకంలో భాగంగా 2025 యాసంగి సీజన్ కోసం జిల్లా వ్యవసాయ శాఖ కేటాయించిన మొక్కజొన్న విత్తనాలను శుక్రవారం హుస్నాబాద్ మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ బంక చందుల,వ్యవసాయ అధికారి వేల్పుల పూజ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న ప్యాకెట్ పూర్తి ధర 1380 ఉండగా రాయితీపై రూ. 980 రైతులకు అందజేయడం జరుగుతుందని, రైతులు మొక్కజొన్న విత్తనాల సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మడప యాదవరెడ్డి, మాజీ కౌన్సిలర్ చిత్తారి పద్మ రవీందర్, ఏఈవోలు సంగీత, స్వామి, రైతులు నాయిని అంజయ్య, ఆలేటి కొండల్ రెడ్డి, గీకురు భీమయ్య పాల్గొన్నారు

## న్యాయమూర్తిపై దాడి అనాగరికం



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడి అనాగరికమని, దాడికి కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హుస్నాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాకేష్ కిషోర్ అనే న్యాయవాది మతోన్మాదంతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని, ఇది రాజ్యాంగాన్ని అవమానపరచడం అన్నారు. రాకేష్ కిషోర్‌ను, అతడిని ప్రోత్సహించిన మతోన్మాదులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వినతిపత్రం ఇచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొలుగూరి అశోక్, ఎంఎస్‌పి హుస్నాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్యాల ప్రకాష్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం మాట్ల వెంకటస్వామి మాదిగ, నాయకులు తామస్, రవి, రాజశేఖర్, కుమారస్వామి, సంపత్ ఉన్నారు.

## కొండపాకలో సిపిఆర్‌పై అవగాహన



సిపిఆర్‌పై అవగహన కల్పిస్తున్న 108 సిబ్బంది

**కొండపాక, అక్టోబరు 17, ప్రభాతవార్త :** అపస్మారక పరిస్థితుల్లో ఉన్న వారికి(కార్డియాక్ అరెస్ట్) సమయంలో ప్రాణాపాయం నుండి ఎలా కాపాడవచ్చో అని సిపిఆర్‌పె అశావర్కర్‌లకు, ఎఎన్ఎంలకు కొండపాక పిహెచ్‌సిలో డాక్టర్ శ్రీధర్ సమక్షంలో ఎంఆర్ఐ గ్రీన్‌హెల్త్ 108 సర్వీసెస్ అధ్వర్యంలో శుక్రవారం మెడికల్ టెక్నీషియన్ బైండ్ల మహేందర్, పైలెట్ రమేష్108 అవగహన కార్యక్రమం నిర్వహించి వివరించారు. మెదక్ జిల్లాన 108 ప్రోగ్రాం మేనేజర్ జాన్ షాహిద్, సిద్దిపేట జిల్లా కో ఆర్డినేటర్ హరిరామకృష్ణ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో 108అంబులెన్స్, 102 అమ్మఒడి వినియోగించుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.కార్యక్రమంలో అయుష్ డాక్టర్ రజిని, హెచ్ఈఒ రమణ, పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పరామర్శించిన కెటిఆర్



ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న కెటిఆర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి(చిన్నకోడూరు):** చిన్నకోడూరు మండల పరిధిలోని గంగాపూర్‌లో ఇటీవల ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్ పరామర్శించి ఓదార్చారు. అధైర్యపడొద్దు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఆయన వెంట పార్టీ శ్రేణులు వేలేటి రాధాకృష్ణశర్మ, కాముని శ్రీనివాస్, కడవెర్గు రాజనర్సు, కీసర పాపయ్య, సదానందంగౌడ్, సంజీవులు, లింగారెడ్డి, కాముని ఉమేష్‌చంద్ర తదితరులు ఉన్నారు.

### ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పరామర్శించిన మాజీ మున్సిపల్ చైర్మన్

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 17 (ప్రభాతవార్త):** రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీచైర్మన్ ఎన్‌సి.రాజమౌళి శుక్రవారం పరామర్శించారు. ఆయనతో పాటు తాజా మాజీ కౌన్సిలర్లు పంబాల అర్చన శివకుమార్, రహీం తదితరులు ఉన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### -కుమ్మరి సంఘం సభ్యుడు కొలిచెలిమె స్వామి

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 17 (ప్రభాతవార్త):**

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గజ్వేల్ కుమ్మరి సంఘం సభ్యుడు కొలిచెలిమె స్వామి అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా చాలా మంది విద్యుత్ దీపాలు, పర్యావరణానికి హాని కలిగించే వస్తువులను వాడుతున్నారని అన్నారు. అలా కాకుండా దీపావళి పండుగ రోజు మట్టితో చేసిన ప్రమిదలలో దీపాలను వెలిగించడం వల్ల పర్యావరణాన్ని కాపాడిన వారమవు తామని తెలిపారు. కుమ్మరులు మట్టితో తయారుచేసే ప్రమిదలు, విగ్రహాలు తదితర వాటిని కొనుగోలు చేయడం వల్ల కుమ్మరులకు జీవనోపాధి కలుగుతుందన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కుమ్మరి సభ్యుల ఆధ్వర్యంలో మట్టితో తయారుచేసిన ప్రతిమలు, ప్రమిదలు, విగ్రహాలను అమ్మడం జరుగుతుందని తెలిపారు. గజ్వేల్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలు వినియోగించుకొని దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

# సిపిఐకి పూర్వవైభవం తీసుకురావాలి

### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రకాష్‌రావు



సిపిఐ పార్టీ కార్యాలయా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

**గుమ్మడిదల అక్టోబరు 17 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో సిపిఐ మండల కార్యాలయానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.ప్రకాష్‌రావు మాట్లాడుతూ గుమ్మడిదల మండలం సంగారెడ్డి జిల్లాలో సిపిఐ పార్టీ కార్యాలయానికి శంకుస్థాపన చేయడం గతంలో ఈ ప్రాంతం నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంగా ఉండేదని నాటి నుండి నేటి వరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తున్న నాయకులు కార్యకర్తలు మండలం మున్సిపల్ పట్టణంగా మారిన తరుణంలో ఇక్కడ ఉన్నటువంటి సమస్యల పరిష్కారానికి కేంద్రంగా కార్యాలయం ఉండాలని ఉద్దేశంతో పార్టీ కార్యాలయ నిర్మాణానికి పూనుకోవడం జరిగిందని గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రం ప్రస్తుత సంగారెడ్డి జిల్లాలోని పటాన్ చెరువు నియోజకవ్వర్గ లోని గుమ్మడిదలలో సిపిఐ పార్టీకి పూర్వం వైభవం తీసుకొస్తారని ఆశిస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో స్వర్గీయ విటల్‌రెడ్డి ఎమ్మెల్యేతోపాటు పనిచేసిన కామ్రేడ్ సంజీవరెడ్డి సంవత్సరం యాక్సిడెంట్లో మృతి చెందడం జరిగింది. ఆయన కుమారుడు కర్ణాకర్‌రెడ్డి ఈ కార్యాలయం నిర్మాణానికి పూనుకోవడం జరిగిందని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సీనియర్ నాయకులు బాల్‌రెడ్డి ఆయన నాయకత్వం చెందిన నాయకులు కార్యాలయానికి నిర్మించాలని పట్టుదలతో నేడు శంకుస్థాపన చేయడం జరిగింది. కార్యాలయ నిర్మాణానికి కొందరు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పడం జరిగిందని త్వరలోనే కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభించి కార్యాలయాన్ని నిర్మిస్తారని మండలంలోని నాయకులు, కార్యకర్తలు పార్టీ సభ్యులు సానుభూతిపరులు ప్రజాసంఘాల నాయకులు మండల ప్రజలు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యాలయ నిర్మాణానికి రాష్ట్ర జిల్లా పార్టీ ఎల్లప్పుడూ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మెదక్ జిల్లా కార్యదర్శి ఎంఎ ఖలీద్ సిపిఐ సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏం బాల్రెడ్డి, ఎండి మహబూబ్ ఖాన్, మానవ హక్కుల సంఘం నాయకులు శ్రీకాంత్, మండల నాయకులు కరుణాకర్‌రెడ్డి, సత్యనారాయణ, మోహన్‌రెడ్డి, విష్ణు, కానుకుంట నరేందర్, ఏఐటియుసి నాయకులు శివశంకర్, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## బిసిలను మోసం చేసిన కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 17 (ప్రభాతవార్త):** బిసి రిజర్వేషన్ పేరుతో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు బిసిలను మోసం చేశాయని కురుమ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బిసిలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే వెంటనే పది మంది మంత్రివర్గ స్థానాలను బిసిలకు కేటాయించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ చేశారు. బిసిలకు న్యాయంచేయాలంటే మాటల్లో కాదు ఆచరణలో చూపించాలన్నారు. బిఆర్ఎస్ పార్టీకి బిసిలను ఆకర్షించే నినాదాలతో ముందుకు వచ్చినా, అధికారంలోకి వచ్చిన తర్వాత బిసిలకు తగిన గౌరవం ఇవ్వలేదన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి బిసి నేతకు ఇవ్వడం ద్వారా బిసిల పట్ల గౌరవాన్ని చాటుకోవాలని ఆయన సూచించారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో ఎందుకు సమన్యాయం చేయలేదని ఆయన ప్రశ్నించారు. 68 సీట్లు ఓసిలకు ఇచ్చి కేవలం 20 సీట్లు మాత్రమే బిసిలకు కేటాయించడం అన్యాయమన్నారు. బిసిలను మోసం చేస్తున్న పార్టీలకు రాబోయే ఎన్నికల్లో బిసిలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

**గుమ్మడిదల అక్టోబరు 17 ప్రభాతవార్త :** కళ్యాణలక్ష్మి ా, షాదీముబారక్ పథ కాలు పేదలకు వరంగా మారాయని పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గం పరిధిలోని అమీన్పూర్, రామచంద్రపురం, గుమ్మడిదల, జిన్నారం, పటాన్ చెరువు రెవెన్యూ మండలాల పరిధిలోని 105 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి ా, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన ఒక కోటి 5 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జీఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, విజయ భాస్కర్ రెడ్డి, మహమ్మద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు జహీరాబాద్ బంద్

**జహీరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో చట్ట బద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్లను అమలుచేసి రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న తెలంగాణ బంద్ కార్యక్రమంలో భాగంగా జహీరాబాద్ బంద్ నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తట్టు నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని శ్రీ భవాని మాత ఆలయం చౌరస్తా వద్దకు ప్రతి ఒక్కరు చేరుకుని సమ్మెను జయవంతం చేయాలని నారాయణ సూచించారు. మండలంలోని అన్ని విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రయివేటు,వ్యాపార సముదాయాలు, బస్సులు, ఆటోలు, హోటళ్లు, పెట్రోల్ బంక్‌లు బంద్ చేసి సంపర్ణ మద్దతు ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు.

## ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు చట్టాలపై అవగాహన

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగాల నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు జిల్లా న్యాయ సేవాధికా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి సౌజన్య మాట్లాడుతూ ప్రతి వృద్ధ పౌరుడుతన హక్కులను తెలుసుకుని అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వార ఉచిత న్యాయ సహాయం అందుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికి న్యాయం అందిచడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. వృద్ధులు తమ పిల్లలు, లేదా వారసుల ద్వార నిర్లక్ష్యానికి, వేదింపులకు, ఆర్థిక ఇబ్బందులకు గురైతే వేయింటేనెన్స్, వెల్ఫేర్ ఆఫ్ పేరంట్స్ అండ్ సీనియర్ సిటిజన్ యాక్ట్-2007 ద్వార న్యాయ పరిరక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు, సభ్యులు, న్యాయ సేవాధికార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకుడి తల్లి మృతి

### పరామర్శించిన పలువురు నాయకులు

**చేర్యాల, అక్టోబరు 17,ప్రభాతవార్త :** మండలంలోని పాత దొమ్మట గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు ముచ్చెంతుల సిద్ధారెడ్డి తల్లి సత్తమ్మ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్‌తోపాటు మండల నాయకులు పరామర్శించి, మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులుగౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగాల నవీన్‌రెడ్డి, నాయకులు శశిధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పాండు,చేర్యాల టౌన్ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, మన్నె సత్య వర్ధన్, మడికొండ శ్రీనివాసరావు,చల్ల బాల్ రెడ్డి , బీజేవైఎం మండల అధ్యక్షులు వ్యాసరిని లక్ష్మీ ృపతి, జనగామ టౌన్ కార్యదర్శి శివకృష్ణ, రంజిత్, యువ మోర్చా నాయకుడు గోనె అమరేందర్ తదితరులు ఉన్నారు.



అంగన్‌వాడీ హెల్పర్లను సత్కరిస్తున్న దృశ్యం

## అంగన్‌వాడీ పిల్లల వృద్ధిలో హెల్పర్ల పాత్ర ముఖ్యం

### జడ్‌పి సిఇవో రమేష్‌బాబు, సిడిపిఓ శారద

**సిద్ధిపేట అర్బన్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** పిల్లల గ్రోత్ మానిటరింగ్‌లో హెల్పర్స్ పాత్ర ఎంతో ముఖ్యమని జడ్పి సీఈవో రమేష్‌బాబు, సిడిపిఓ శారద అన్నారు. సిద్దిపేట ఐసిడిఎస్ కార్యాలయంలో పోషణ మాసం ముగింపు వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పరిధిలోని హెల్పర్స్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ హెల్పర్స్ రోజువారీ మెనూ ప్రకారం ఆహారం సిద్ధం చేసి పిల్లలకు సమయానికి పోషకాహారం అందించాలన్నారు. పిల్లల పట్ల ప్రేమ, ఓర్పు జాగ్రత్తతో వ్యవహరించాలన్నారు. ప్రతి రోజు సెంటర్‌ను సమయానికి ప్రారంభించి శుభ్రపరచడం పరిశుభ్ర వాతావరణం కల్పించడంపై దృష్టి పెట్టాలన్నారు. తల్లిదండ్రులతో సమన్వయం పాటించాలన్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలతో మర్యాదగా ఆదరాభిమానాలతో మెలిగి వారికి అవసర మైన సూచనలు అందించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్‌తో సమన్వయంగా పని చేయడం ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. హెల్పర్స్‌కు యూనిఫారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుకుమారి, పోషణ అభియాన్ సిబ్బంది శ్రీనివాస్, వెంకటప్రసాద్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

### బాణసంచా విక్రయానికి అనుమతులు తప్పనిసరి : ఎస్ఐ

**కోహెడ, అక్టోబరు 17, ప్రభాతవార్త :** ప్రభుత్వ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా టపాకాయలు విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అభిలాష్ హెచ్చరించారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగ నేపథ్యంలో మండలంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా ఇంటి వద్ద కానీ దుకాణాలలో కానీ ఫైర్ క్రాకర్స్ నిలువలు ఉంచినా లేదా విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా దుకాణాలు ఏర్పాటు చేసి బాణ సంచాలు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. మండలంలో ఎవరైనా అక్రమంగా టపాసులు అమ్మితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

## పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలి

**నంగునూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** పిఆర్‌సిని అమలుచేసి పెండింగ్‌లో ఉన్న డిఎలు వెంటనే విడుదల చేయాలని టిపిటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి.తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. నంగునూర్ మండలంలో టిపిటిఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో సభ్యత్వంతో పాటు విద్యారంగ సమస్యల సేకరణలో భాగంగా శుక్రవారం ముండ్రాయి, రాజగోపాల్‌పేట, పాలమాకుల, బద్దిపడగ, మగ్దుంపూర్, నంగునూర్, నర్మెట, అంక్షాపూర్ తదితర పాఠశాలలను సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2023 నుంచి అమలు చేయాల్సిన పిఆర్‌సిని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. వెంటనే పిఆర్‌సిని అమలు చేసి పెండింగ్‌లో ఉన్న డిఎలు విడుదల చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోలీస్టులను భర్తీ చేయాలన్నారు. ఖాళీలు భర్తీ చేయకపోవడంతో విద్యా బోధనకు ఆటంకం కలుగుతుందన్నారు. పాఠశాలల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. బద్దిపడగలో సస్పెన్షన్ గురైన హెచ్ఎంను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందన్నారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ ప్రతినిధులు సత్యనారాయణ, పొన్నమల్ల హరికృష్ణ, పొట్లపల్లి నాగయ్య, రాజు, గొట్టిపర్తి రామస్వామిగౌడ్, రాజిరెడ్డి, తిరుపతి, రాజమౌళి, అంబిక, సుశీల తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం స్వీకరిస్తున్న దృశ్యం

# చీఫ్ జస్టిస్‌పై దాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 17 (ప్రభాతవార్త):**

చీఫ్ జస్టిస్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఉబ్బని ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలపడంతో పాటు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్‌నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయి దళితుడు కావడం వల్లే దాడి జరిగిందని అన్నారు. గవాయి స్థానంలో అగ్రకులాలకుచెందిన జడ్జి ఉంటే ఈ దాడి జరిగేది కాదని చెప్పారు. గవాయిపై జరిగిన దాడితో దళితుల ఆత్మగౌరవం ప్రమాదంలో పడిందన్నారు. దళితులు ఉన్నత స్థానంలో ఉండడాన్ని ఉన్నత వర్గాలకు చెందిన శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయని ఆరోపించారు. ఈ సంఘటన జరిగి పది రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆ వ్యక్తిపై కేసు పెట్టకపోవడం, అరెస్ట్ చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. తక్షణమే దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఈనెల 27న లక్షలాది మందితో హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనను నిర్వహించి తీరుతామని తెలిపారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు మైస రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె మహేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు ముండ్రాతి కృష్ణ, నాయకులు బొంది స్వామి, మల్కగల్ల రమేష్, గూడూరి శ్రీకాంత్, నరేందర్, దుర్గి రాజు, శనిగారి రాజు, దయ్యాల మల్లేశ్, చెప్యాల రాజు, ప్రసాద్, ముండ్రాతి నవీన్, కార్తిక్, విహెచ్‌పిఎస్ నాయకులు మైస హరికృష్ణ, శ్రీనివాస్, మోచి వేణు, ఫైసా బాబు, ములుగు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నేటి బిసి బంద్‌ను విజయవంతం చేయాలి

### -బిసి ఐక్య వేదిక మండల కన్వీనర్ బలరాం ముదిరాజ్

**జగదేవ్‌పూర్, అక్టోబరు 17 (ప్రభాతవార్త):** పిలిస్తే కాదు తెలిస్తే రావాలి అనే నినాదంతో ఈనెల 18న నిర్వహించే రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బిసి ఐక్య వేదిక మండల కన్వీనర్ బలరాంముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బిసి జేఏసి ఇచ్చిన పిలుపుమేరకు కుల సంఘాలు, పార్టీలకతీతంగా బిసిలు అందరూ బంద్‌లో పాల్గొని సత్తా చాటాలన్నారు. బంద్‌కు జగదేవ్‌పూర్ మండల బిసి ఐక్య వేదిక సంపూర్ణ మద్దతు ప్రకటించామని, బిసి జేఏసి చేపడుతున్న బిసిల హక్కుల సాధన దిశగా ఇది తొలి అడుగు అని పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు, బిసిలకు తగిన గౌరవం, ప్రాధాన్యం దక్కాలంటే బిసిల ఐక్యత సమాజానికి తెలియజేస్తూ బిసి బంద్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర బంద్‌కు పోలీసు అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాపారస్తులు సహకరించాలని, ఇతర కుల సంఘాలు బందులో పాల్గొని బిసిలకు మద్దతు ప్రకటించాలని కోరారు.

### బంద్‌కు హుస్నాబాద్ అడ్వకేట్ అసోసియేషన్ మద్దతు

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నేడు(శనివారం) బిసి ఐక్య వేదిక తలపెట్టిన తెలంగాణ బంద్‌కు హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానించి మద్దతు ప్రకటించింది. నిర్వహించే బంద్‌కు బార్ అసోసియేషన్ అడ్వకేట్ సభ్యులు సహకరిస్తామని ప్రకటించారు. బంద్‌లో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అందరు ఐక్యంగా మద్దతు తెలియచేయాలని బార్ అసోసియేషన్ కోరింది.

## మిత్రుడి జ్ఞాపకార్థం పూర్వ విద్యార్థుల వితరణ

**మర్కుక్, అక్టోబరు 17 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2012-13 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల సైన్స్ ల్యాబ్‌కు రూ.20వేల విలువైన టేబుల్స్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కీర్తి, సతీష్, సురేష్, నరేష్, రాజు మాట్లాడుతూ తమతోపాటు పదవ తరగతి చదివిన కాశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చంద్రాజు ఉపేంద్ర ఆకస్మికంగా మృతిచెందగా ఆయన జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ వెంకటరాములు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ తోటి విద్యార్థి జ్ఞాపకార్థం పాఠశాలకు సహకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, పిఆర్‌టియు ప్రధాన కార్యదర్శి కుమార్, చిన్నబ్రహ్మయ్య, వెంకటనరసింహారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి బంద్ కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలి

### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు

**సిద్ధిపేట అర్బన్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** బీసీ జెఎసి పిలుపుతో ఈనెల 18న జరగనున్న రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని..బీసీల రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ వెనకడుగు వేసే ప్రసక్తేలేదని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ న్యాయసమ్మతమైనదేనని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి అన్ని పార్టీల నాయకులు ఒకే తాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో బీసీలకు తగిన గౌరవం, న్యాయం అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీసీ జెఎసి బంద్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలన్నారు. బీసీలను నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బంద్ ప్రజాస్వరంలా మారాలన్నారు.

## నార్కోటిక్ డ్రగ్స్ తయారు చేస్తే చర్యలు

### జిల్లా ఔషధ నియంత్రణశాఖ ఎడి రాజు

**సిద్ధిపేట అర్బన్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏదైనా ప్రాంతాల్లో కానీ ఇళ్ళు, ఫ్యాక్టరీలలో నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్ స్టాన్స్‌వంటి డ్రగ్స్ తయారీ కార్యకలాపాలు ఉంటే టోల్ ఫ్రీ నంబరు 18005996969తోపాటు ఆయా జిల్లాల డ్రగ్ ఇన్స్పెక్టర్లకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఔషధ నియంత్రణశాఖ ఎడి రాజు తెలిపారు. నార్కోటిక్ డ్రగ్స్ తయారుచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానాస్పదంగా కనిపించినా, ఎవరైనా వ్యక్తులు డ్రగ్ విక్రయాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఇలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలను గుర్తిస్తే నకిలీ, నాణ్యత లేని మందులను మార్కెట్‌లోకి రాకుండా నివారించవచ్చని తెలిపారు.

## విజయవంతంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స

**సిద్ధిపేట అర్బన్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రోగికి విజయవంతంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ నిర్వహించినట్లు హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి వైద్యులు మురళీనాథ్ తెలిపారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి(సికెడి)తో బాధపడుతున్న 41 యేండ్ల రోగి బాల గనగోని సికెడి నిర్వహణ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ తర్వాత పూర్తిగా కోలుకున్నారని తెలిపారు. అధునాతన మూత్రపిండ సంరక్షణలో మరో మైలురాయిని సాధించినట్లు తెలిపారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

**కొండపాక, అక్టోబరు 17, ప్రభాతవార్త :** బందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కామిరెడ్డి చంద్రారెడ్డినజ్ఞాపకార్థం ఆయన కుమారుడు టీచర్ సుంకేశ్వర్‌రెడ్డి 65 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేసినట్లు హెచ్ఎం రామచంద్రం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని, విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకొని సమాజానికి సేవ చేయాలని సూచించారు. పాఠశాల పక్షాన ఉపాధ్యాయులందరు సుంకేశ్వర్‌రెడ్డిన్ద కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, బాల కనకయ్య, భాగ్యలక్ష్మి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలను జయప్రదం చేయాలి

**కొండపాక, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ॥ 26 వేలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ కొండపాక మండల కార్యదర్శి అమ్ముల బాల్‌నర్సయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కొండపాకలో ఆయన 5వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికుల కోసం పోరాటం చేస్తున్న ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జాలిగామ ప్రభాకర్, అరుట్ల నర్సింలు, బర్మ కొమురయ్య, రమణచారి, నక్క రమేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

### బిజెపి మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 17 (ప్రభాతవార్త):** పట్టణంలోని బాలికల, బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లను శుక్రవారం బిజెపి మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్లతో మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందించే మెనూ ప్రకారం భోజనాలు అందించాలని తెలిపారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ హాస్టల్‌లో సౌకర్యాలు సరిగ్గా ఉన్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. బాలికల హబ్‌లో విద్యార్థులకు సరిపడా వంట కార్మికులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ప్రభుత్వం హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకు అనుగుణంగా వంట కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యుడు మన్నె శేఖర్, మండల ప్రధాన కార్యదర్శి బారు అరవింద్, మండల నాయకులు కర్నాల శ్రీనివాస్, కుమార్‌గౌడ్, చంద్రం, రాజు, మహేందర్, పొట్టి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న బిజెపి నాయకులు

## వనదుర్గామాత ఆలయం పునఃప్రారంభం

**-62రోజుల అనంతరం అమ్మ దర్శనం**



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

**పాపన్నపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
ఏడుపాయల వనదుర్గాభవానీమాత ఆలయం సుమారు 62రోజుల అనంతరం పునఃప్రారంభమైంది. భారీవరదలు, మంజీరా ఉధృతిమూలంగా ఆగస్టు 14వ తేదీన వనదుర్గామాత ఆలయాన్ని మూసివేసిన సంగతి విదితమే. కాగా అప్పటినుండి దుర్గామాత ఉత్సవవిగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు నిర్వహించారు. సుమారు రెండునెలలపాటు ఆలయం జలదిగ్బంధంలో ఉండడం మూలంగా భారీనష్టం సంభవించింది, ఇటీవల మంజీరా ఉధృతితగ్గడంమూలంగా సింగూర్ ప్రాజెక్ట్ గేట్లను మూసివేశారు. దీంతో ఆలయం ముందు నుండి వరద తగ్గింది. నీటిప్రవాహం తగ్గడంతో శుక్రవారం ఉదయం ఆలయాన్ని పునఃప్రారంభించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## బిసి బంద్‌ను విజయవంతం చేయాలి

**-కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చంద్రం క్రిష్ణగౌడు**

**కౌడిపల్లి, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
నేడు బిసిల 42% రిజర్వేషన్ కోసం పార్టీలకు అతీతంగా బిసి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే బందును విజయవంతం చేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ సినియర్ నాయకులు చంద్రం క్రిష్ణగౌడు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కౌడిపల్లి శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంవద్ద ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ నేడు బిసి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బంద్ నిర్వహిస్తున్న సందర్భంగా గౌడ జనహక్కుల పోరాట సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న గౌడన్నలు అందరు భారీసంఖ్యలో పాల్గొని బంద్‌కు మద్దతూ తెలుపుతూ బిసిల 42% రిజర్వేషన్లు సాధించే దిశగా ముందుకు సాగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆయనతోపాటు కౌడిపల్లి గౌడ సంఘం సభ్యులు చంద్రం వెంకటేశంగౌడు, కిషోర్‌గౌడు, రమేష్‌గౌడు, పుండరీకంగౌడు, సత్యనారాయణగౌడు, ఓబలాషి యాదగౌడు, పోన్నం మహవీర్‌గౌడు, చిన్నగౌడు, ఆరవింద్‌గౌడు, దశరథ్‌గౌడు, ప్రభాకర్‌గౌడు, మోతీలాల్‌గౌడు, పెంటాగౌడు, శేఖర్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి రామాయంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా బసన్నపల్లి మల్లేశం

**-ప్రధాన కార్యదర్శిగా పటేరి రాము**

**రామాయంపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
టియుడబ్ల్యుజె (ఐజెయు) రామాయంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా మరోసారి బసన్నపల్లి మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా పటేరీ రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని ప్రగతి రిసార్ట్‌లో టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు శంకర్‌దయాల్‌చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి.శ్రీనివాసశర్మ, జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా జిల్లా కోశాధికారి వూడెం దేవరాజు వ్యవహరించారు. ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా బొంతల సత్యనారాయణ, బల్ల యాదగిరి, కోశాధికారిగా తుజాల శ్రీనివాస్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా కర్రే నరేందర్, కార్యవర్గ సభ్యులుగా తుడుం పెంటయ్య, సార్గు నర్సింలు, రామచంద్రరెడ్డి, సర్దార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా డి.జి.శ్రీనివాసశర్మ, వూడెం దేవరాజులు ఎన్నికయ్యారు.

## కెసిఆర్ కాలనీ అధ్యక్షుడిగా మరోమారు కట్ట ప్రభాకర్

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
రామాయంపేట మున్సిపాలిటీలోని కెసిఆర్ కాలనీ (డబుల్ బెడ్‌రూమ్) అధ్యక్షుడిగా మరోమారు కట్ట ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం కాలనీ సర్వసభ్య సమావేశం నిర్వహించి, అనంతరం ఎన్నికలను నిర్వహించారు. సమావేశంలో సభ్యులంతా మూడవసారికూడా కట్ట ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలోనే పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం కాలనీవాసులు అధ్యక్షుడు కట్ట ప్రభాకర్‌తోపాటు, ఇటీవలే రామాయంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికైన మద్దెల సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఎల్లాగౌడ్, దేశాయిపేట శ్రీనివాస్, దేవుని రాములు, లద్ద నర్సింలు, గొంగళ్ల వెంకటి, కోమటి నగేష్, మద్దెల క్రిష్ణ పాల్గొన్నారు.

## పత్తి పంటను నమోదు చేసుకోవాలి

**-మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ**

**సిర్గాపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
పత్తిపంటను సాగుచేసుకుంటున్న రైతులు విధిగా తమపంట వివరాలను మండల వ్యవసాయ విస్తీరణ అధికారి వద్ద విధిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ సూచించారు. ఈనెల 22వ తారీఖునుంచి ఏఈఓలు తమ కస్టర్ పరిధిలోని గ్రామాలను సందర్శించి కపాస్ కిసాన్ యాప్‌ను విధిగా ప్లే స్టోర్‌కు పోయి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తమ ఫోన్‌కు వచ్చిన ఓటిపిని తెలిపితే పత్తిని అమ్ముకునే వీలు ఉంటుందని, అందుకు ప్రతి పత్తిరైతు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

## బిసిలను మోసంచేస్తున్న కాంగ్రెస్‌ను గద్దెదించాల్సిందే

**కొల్చారం, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
నేడు నిర్వహిస్తున్న బిసి బంద్‌ను విజయవంతం చేయండి బిసిలను మోసంచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించాల్సిందే అని, కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే స్థానిక ఎన్నికలలో బుద్ధిచెప్పాలని బిసిలను మోసంచేస్తున్న ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకి దక్కిందని కొల్చారం మండల మాజీ జడ్పిటిసి సభ్యురాలు ముత్యంగారి మేఘమాల సంతోష్ కుమార్ అన్నారు. భారతీయ రాష్ట్ర సమితి శనివారం నిర్వహించిన బందుకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపారని ఈ సందర్భంగా విజ్ఞప్తిచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిసిల పట్ల మొసలికన్నీరు కారుస్తున్నారని ప్రతి దగ్గర బిసిలకు అన్యాయమే జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. మండలవ్యాప్తంగా ఉన్న బిఆర్ఎస్ నాయకులు మద్దతుగా ముందుకు వస్తున్నారని శనివారం నిర్వహిస్తున్న బిసి బంద్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## బిసి బంద్‌కు కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ మద్దతు

**-మెదక్‌జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్**

**నర్సాపూర్, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
బిసి 42శాతం రిజర్వేషన్ బిల్లు ఆమలుకోసం బిసి జెఏసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బిసి బంద్‌కు కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ మద్దతునిస్తుందని మెదక్‌జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ ఆదేశాలమేరకు బిసిలకు 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం బిజెపిపై ఒత్తిడి పెంచేందుకు బిసి జెఏసి ఈ నెల 18న ఇచ్చిన రాష్ట్రవ్యాప్త బంద్‌కు మెదక్‌జిల్లా కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణమద్దతు ప్రకటించిందని తెలిపారు. ఈమేరకు కాంగ్రెస్‌పార్టీనాయకులు, కార్యకర్తలు బంద్‌ను విజయవంతం చేయాలని ఆంజనేయులుగౌడ్ కోరారు.

## బిసి బంద్‌ను విజయవంతం చేస్తాం

**చిన్నశంకరంపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
నేడు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బిసి బందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని మండల బిసి జెఏసి నాయకులు పిలుపునిచ్చారు. వ్యాపార వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు రమణ, సత్యనారాయణ, యాదగిరి, ఎన్నారై చంద్రశేఖర్, రాజు, భూషణం తదితరులు పాల్గొన్నారు.

# గుంతలమయంగా పోచంపల్లి రోడ్డు

**-ప్రాణాలు చేతిలోపెట్టుకుని ప్రయాణీకుల ప్రయాణం**
**-గిరిజన సంక్షేమసంఘం ఉమ్మడిజిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్**



గుంతలమయంగా మారిన పోచంపల్లి రోడ్డు దృశ్యం

**చౌటకూరు, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరు నుంచి పసానిపల్లి గుండా బొమ్మారెడ్డిగూడెం, లక్ష్మీసాగర్, హన్మ్యనాయక్ తండా, కొండారెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి, సంగ్యనాయక్ తండా, విఠల్‌నాయక్ తండా, లాల్సింగ్‌నాయక్ తండాలమీదుగా ముదిమాణిక్యం పుల్కల్‌కు వెళ్లే బిటిరోడ్డు అధ్వాన్నంగా తయారయిందని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలతో కలిసి అధ్వాన్నంగా మారిన రోడ్డును పరిశీలించి స్థానిక విలేకరులతో రవీందర్‌నాయక్, మోహన్, సంగ్య, మోత్య, సంతోష్, సురేష్, శివ, శంకర్, మహదేవ్, నరేందర్, శివప్ప, నర్సింగ్‌రావులతో కలిసి జైపాల్‌నాయక్ మాట్లాడుతూ కొద్దిపాటి చినుకులు పడితే ఈరోడ్డుపై ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని విచారం వ్యక్తంచేశారు. ఆధ్వాన్నంగా మారిన రోడ్డుగుండా ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు తిరుగాడక తప్పకపోవడంతో రోడ్డుపరిస్థితి మరీ దయనీయంగా మారిందని, ప్రాణాలను అరచేతిలోపెట్టుకుని వాహనచోదకులు తమవాహనాలను తోలాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డును పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి అధికారులు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు జిల్లా అధికారులు, మంత్రి దామోదర్ రాజనర్సింహాల దృష్టికి తీసుకుపోయి రోడ్డు సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జైపాల్‌నాయక్ డిమాండ్ చేశారు.

## మోడల్ మీట్ మార్కెట్ నిర్మాణానికి స్థల పరిశీలన

**-కార్పొరేటర్ పుష్పనగేష్**



మోడల్ మీట్ మార్కెట్ నిర్మాణానికి స్థలాన్నిపరిశీలిస్తున్న కార్పొరేటర్

**రామచంద్రాపురం, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఓల్డ్ రామచంద్రాపురంలో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల వద్ద పురాతన మీట్ మార్కెట్ స్థానంలో 2 కోట్ల రూపాయలతో నిర్మించ తలపెట్టిన నూతన మోడల్ మీట్ మార్కెట్ నిర్మాణానికి శుక్రవారం కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ విభాగ ఎస్ఈ శంకర్, ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, ఏఈ దివ్య ఉన్నారు.

## న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య

**-తహసీల్ ముందు ఎమ్మార్పీఎస్ నిరసన**



నిరసన వ్యక్తంచేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**జహీరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి హేయమైన చర్యగా అభివర్ణిస్తూ ఎంఆర్‌పిఎస్ దాడిని తీవ్రంగా ఖండిస్తూ తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తంచేసి, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ పి.దశరథ్‌కు వినతిపత్రం అందచేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ సూచనల మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లానాయకులు అబ్రహాంమాదిగ, ఉల్లాస మాదిగ, అరుంధతిసంఘం అధ్యక్షులు వరాల్, జైరాజ్, ఆనంద్, బిజెపి రాష్ట్రనాయకులు సుధీర్ బండారి, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, టిఆర్పి జహీరా బాద్ ఇంచార్జి శ్రీకాంత్‌ముదిరాజ్, సమతా సైనిక్‌దళ్ అధ్యక్షులు బాల్‌రాజ్, సోషల్‌మీడియా జిల్లా ఇంచార్జి జాన్‌మాదిగ, వికలాంగులసంఘం నాయ కులు ఆహ్మద్, ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షులు జైరాజ్‌మాదిగ, ఎంఎస్‌పి సహాయకార్యదర్శి పద్మారావు, ఎమ్మార్పీఎస్ ఆయామండలాల అధ్యక్షులు మైఖేల్, నిర్మల్, టింకు, ప్రభాకర్, సుకుమార్, సునీల్, పుత్రాజ్, జేమ్స్, ప్రవీణ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండుగడ్డిలా మారిన వరి

**-నష్టపరిహారం అందించాలని రైతుల వినతి**

**నిజాంపేట్, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
నిజాంపేట్ మండలం జంబికుంట, కొత్తపల్లి, బాచేపల్లి, నాగ్దర్, మునిగేపల్లి, దామరచెరువు, రాంరెడ్డి పేట్లో రైతులు సాగు చేసిన సన్న రకం వరికి వైరస్ సోకడంతో కోత దశలో ఎండు గడ్డిలా మారిందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నిమందులు పిచికారీచేసినా ప్రయోజనంలేదని వాపోతున్నారు. వ్యవసాయాధికారులు పంట పరిశీలన చేసి నష్టపోయినవారికి నష్ట పరిహారం అందించాలనికోరారు. భారీవర్షాలవల్ల, వరదలవల్ల పంటనష్టం కూడా భారీగా జరిగినది. సర్వేచేసి సకాలంలో ప్రభుత్వానికి అధికారులు నష్టపరిహారానికి నివేదిక పంపాలని రైతులుకోరుకున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుకుంటున్నారు.

## జహీరాబాద్‌లో జర్నలిస్టుల నిరసన



ఆర్డీఓకు వినతి పత్రం అందచేస్తున్న జర్నలిస్టులు

**జహీరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
ఓదినపత్రిక ఎడిటర్‌ని ఆంధ్రప్రదేశ్ పోలీసులు అకారణంగా వేధించడాన్ని నిరసిస్తూ శుక్రవారం జహీరాబాద్‌లో జర్నలిస్టులు నిరసనర్యాలీ నిర్వహించారు. జర్నలిస్టుల నిరసనకు బిఆర్ఎస్, బిజెపి నాయకులు నిరసన ర్యాలీలో పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. జర్నలిస్టులు ఆర్డిఓ దేవుజాకు వినతి పత్రం అందచేశారు. ఈసందర్భంగా జర్నలిస్టులు పత్రికా స్వేచ్ఛ కాపాడాలని, పోలీసుల వేధింపులు ఆపాలని నినాదాలుచేశారు. ఓపత్రిక ఎడిటర్‌కు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నాలుగురోజుల్లో నాలుగుసార్లు హైద్రాబాద్ కార్యాలయానికి ఏపి పోలీసులు వెళ్లి వేధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, తట్టు నారాయణ, బిజెపి నాయకులు సుధీర్ బండారి, సామాజికనేత మాదినం శివప్రసాద్, ఆయాజర్నలిస్టు సంఘాల నాయకులు ఎర్బల్ శ్రీనివాస్‌రెడ్డి, మినాజ్, సిద్దన్న పాటిల్, శ్రీనివాస్‌శాస్త్రి, జె.శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్, మల్లన్న, టి.అశోక్, సత్యనారాయణరెడ్డి, రాచన్న, అక్తర్, నర్సింహులు, శ్రీనివాస్, రోషన్, జగన్, కరీం, జగదీష్, ఇమ్రాన్, నియామత్, ఇయామత్, అక్రమ్ పటేల్, అల్లాభక్షులు పాల్గొన్నారు.

## రాకేష్‌కిషోర్‌ను అరెస్టు చేయాలి

**-తహసీల్దారు కార్యాలయం ముందు ఎంఆర్‌పిఎస్ నిరసన**



నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**చౌటకూరు, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
చీఫ్ జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయిపై దాడిచేసిన రాకేష్‌కిషోర్‌ను వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఎర్రోళ్ల రమేష్‌మాదిగ డిమాండ్‌చేశారు. శుక్రవారం మండలకేంద్రమైన చౌటకూరులోని తహసీల్దార్ కార్యాలయంముందు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ పిలుపుమేరకు ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఎర్రోళ్ల రమేష్‌మాదిగ ఆధ్వర్యంలో నిరసనకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎఆర్‌పిఎస్ జిల్లా అధికార ప్రతినిధి నల్లోల్ల ప్రవీణ్‌కుమార్‌మాదిగ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో చౌటకూరు గ్రామ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు అశోక్‌మాదిగ, నాయకులు చక్రపాణిమాదిగ, రాజలింగంమాదిగ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాటన్ కపాస్ యాప్‌పై రైతులకు అవగాహన

**న్యాల్‌కల్, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
ఈనెల 18న మండలకేంద్రమైన న్యాల్‌కల్‌లోని రైతువేదికలో కాటన్ కపాస్ యాప్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఈఓ ఈనా రాథోడ్ తెలిపారు. ఉదయం 10.30గంటలకు అవగాహనకార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. మండంలో పత్తిపంటను సాగుచేసుకుంటున్న రైతులు అవగాహన కార్యక్రమానికి హాజరై ప్రయోజనం పొందాలన్నారు. పత్తి రైతులు తమ మొబైల్‌నంబర్ అప్డేషన్ చేసుకోవాలని, కాటన్ కపాస్‌యాప్ ద్వారా పత్తి మిల్లులో స్లాట్ బుక్‌చేసుకుంటేనే పత్తిని అమ్ముకునే అవకాశం ఉంటుందన్నారు. మండలంలోని పత్తి రైతులు అవగాహన కార్యక్రమానికి హాజరై ప్రయోజనం పొందాలని ఈనా రాథోడ్ సూచించారు.

# బోధన చేయని ఉపాధ్యాయుడు మాకొద్దంటూ విద్యార్థుల ధర్నా

**-పలుమార్లు డిఈఓకు విన్నవించినా ప్రయోజనం శూన్యం**
**-కన్నారం జిల్లాపరిషత్ విద్యార్థుల మొర**



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు ధర్నాచేస్తున్న విద్యార్థుల దృశ్యం

**కౌడిపల్లి, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
దండించడం తప్ప విద్యా బోధన చేయడం రాని ఉపాధ్యాయుడు శ్రీకాంత్ గౌడు మాకు వద్దంటూ నిరసిస్తూ విద్యార్థులు పాఠశాల ఎదుట శుక్ర వారం ధర్నా కార్యక్రమం చేపట్టిన సంఘటన మండల పరిధిలోని కన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు చోటు చేసుకుంది. వివరాల ప్రకారం కన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ఫిజికల్ సైన్స్ బోధించే ఉపాధ్యాయుడు శ్రీకాంత్ గౌడు పాఠాలు సక్రమంగా చెప్పకపోవగా తమను ఆ కారణంగా దండిస్తున్నాడని విద్యార్థులు ఆరోపించారు. ఇదే విషయంపై జిల్లా విద్యాధికారికి పిర్యాదులు చేసిన ఫలితం లేకపోవడంతో ధర్నాకు కూర్చుండవల్సి వచ్చిందని విద్యార్థులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుండియే విద్యార్థులు పాఠశాల ఎదుట ధర్నాకు కూర్చోడంతో విషయం తెలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ధర్నా కార్యక్రమాన్నికి వచ్చి మద్దతు తెలుపడంతో పాటు పాఠశాల ప్రదానోపాధ్యాయులుతో వాగ్వివాదం చేసుకున్నారు. కొట్టడం తప్ప చదవడం రాదనే నినాదాలు చేసుకుంటూ సుమారు గంటపాటు విద్యార్థులు ధర్నాలో కూర్చుండి పోయారు. తరగతి గదిలోకి వచ్చిన సమయం నుండి పిరియాడ్ కాలం అయిపోయే వరకు ఫోన్‌లో మాట్లాడం చేస్తుంటాడని విద్యార్థులు తెలిపారు. విద్య బోధన ఆంగ్ల మాధ్యమంలో ఉంటే పాఠాలను తప్పుతప్పులు చదివి, వాటి ఆర్థం ఆంగ్లంలోనే వివరించాల్సింది పోయి తెలుగులో చెప్పడం జరుగుతుందని విద్యార్థులు తెలిపారు. ఉపాధ్యాయుడు శ్రీకాంత్ గౌడును తమ పాఠశాల నుండి తక్షణమే బదిలి చేసి, మరోక్క ఉపాధ్యాయుని నియమించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు దండించే ఉపాధ్యాయునిపై జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇదే విషయమై పాఠశాల ప్రదానోపాధ్యాయుని వివరణ కోరగా తన దృష్టికి ఇప్పుడే వచ్చిందని వెంటనే జిల్లా విద్యాధికారికి నివేదిక పంపించి, శ్రీకాంత్‌గౌడుపై బదిలి వేటు చేయించి, మంచి ఉపాధ్యాయుని బదిలిపై రప్పించడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని హామి ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మిలటరీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా రఘునాథం

**పుల్‌కల్, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
మిలిటరీ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా వడిగెపల్లి రఘునాథంముదిరాజ్ ఎన్నికయ్యారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులసంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా రఘునాథం (ఇస్మాయిల్‌ఖాన్‌పేట), ఉపాధ్యక్షులుగా బుస్సా రాములు (పటాన్‌చెరు), ప్రధాన కార్యదర్శిగా గొడుగు బాలరాజుముదిరాజ్ (ఫసల్‌వాది), సంయుక్త కార్యదర్శిగా బస్వాపురం బూశయ్య (శేరిరాంరెడ్డిగూడెం), కోశాధికారిగా బోయిని మాణయ్య (సంగారెడ్డి), కార్యవర్గసభ్యులుగా నక్కల వెంకన్న (కొత్లాపూర్), ఎంఇ బాబు మియా (సింగాపూర్)లను ఎన్నుకున్నారు. మిలిటరీ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలిసికట్టుగా ఉద్యమించాలని సమావేశం తీర్మానించింది. కేంద్రప్రభుత్వం అందచేయాల్సిన ప్రయోజనాలపై త్వరలోనే సమావేశం అవుతామని ప్రధాన కార్యదర్శి బాలరాజు ముదిరాజ్ పేర్కొన్నారు.

## మోర్గి మోడల్ పాఠశాలలో మాక్ పోలింగ్



మోర్గి మోడల్ పాఠశాలలో మాక్‌పోలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

**నాగల్‌గిద్ద, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మోర్గి గ్రామంలోని మోడల్ పాఠశాల, కళాశాలలో శుక్రవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. మాక్‌పోలింగ్‌ను పురస్కరించుకుని 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్‌లో విద్యను అందుకుంటున్న 410మంది విద్యార్థులు మాక్‌పోలింగ్‌లో పాల్గొన్నారు. విద్యార్థులు తమ ఓటుహక్కును వినియోగించుకోవడంతోపాటు ఓటువిలువ, ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల హామీలు ఎలా ఉంటాయో అవగాహన పొందారు. ఎన్నికల అధికారుల విధులు నిర్వహించే తీరుపై అవగాహన పొందారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారిగా ప్రిన్సిపాల్ సువర్ణ వ్యవహరించగా మాక్‌పోలింగ్ కార్యక్రమానికి మండలవిద్యాధికారి మన్మద కిషోర్, నాగల్‌గిద్ద జడ్పిహెచ్ఎస్ ప్రిన్సిపల్ సిద్దారెడ్డి కార్యక్రమాన్ని సమీక్షించారు.

## 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సిందే

**-బిసి సంఘాల డిమాండ్**

**పుల్‌కల్, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
బిసిరిజర్వేషన్లను అన్ని రాజకీయపార్టీలు సమర్థిస్తున్నందున తమిళనాడు తరహాలో చట్టంచేసి 9వషెడ్యూల్‌లోచేర్చి చట్టబద్ధత కల్పించాల్సిన అవసరం ఉందని మండల బిసిసంఘం నాయకులు ఇందిరి మోహన్ సూచించారు. శుక్రవారం మోహన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ న్యాయసమీక్ష నుంచి రక్షించబడిన కేంద్ర, రాష్ట్ర చట్టాల జాబితా అన్నారు. భూసంస్కరణలు, సామాజిక న్యాయానికి సంబంధించిన చట్టాలను కోర్టులో సవాలుచేయకుండా కాపాడటానికి ఇది రూపొందించబడిందని గుర్తుచేశారు. 1951లో రాజ్యాంగచట్టం ద్వారా చేర్చబడిన వ్యవసాయం, భూమి సమస్యలు, రిజర్వేషన్లపై చట్టాలు ఉన్నాయన్నారు. 9వ షెడ్యూల్‌లోని చట్టాలు రాజ్యాంగ ప్రాథమికనిర్మాణాన్ని ఉల్లంఘిస్తే అవి న్యాయసమీక్షకు లోబడి ఉంటాయని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు.

## జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఆవిష్కరణ ఎంపిక



జాతీయ వైజ్ఞానిక ప్రదర్శన దృశ్యం

**పాపన్నపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
మండలంలోని చీకోడ్‌లింగాయిపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి శివచైతన్య రూపొందించిన ఆవిష్కరణ జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు గైడ్, టీచర్ కిషన్‌ప్రసాద్ తెలిపారు. విద్యార్థి శివచైతన్య ఉపాధ్యాయుడు కిషన్‌ప్రసాద్ సూచనలతో మోడ్రన్ మల్టిపర్పస్, అడ్వాన్స్ హైడ్రాలిక్ అనే ఆవిష్కరణ తయారు చేశాడు. ఈ ఆవిష్కరణ జిల్లా, రాష్ట్ర, దక్షి ణభారతస్థాయిలో ఎంపికై ప్రశంసలుపొంది గురువారం ఎన్‌సిఆర్టీ ద్వారా జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు గురువారం ఎంపికైంది. నవంబరు 18నుంచి 23వరకు మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగే జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొననున్నట్లు కిషన్‌ప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని, ఉపాధ్యాయుడిని ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, మండలవాసులు అభినందించారు.

## రైతులు పత్తిని సిసిఐకి అమ్మడానికి కపాస్ కిసాన్‌లో స్లాట్ బుక్‌చేసుకోవాలి

**కొల్చారం, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
పత్తి పండించిన రైతులు తమపత్తిని సిసిఐకు మద్దతుధరకు అమ్మాలంటే ముందుగా స్లాట్ బుక్‌చేసుకోవాలని కొల్చారం మండలవ్యవసాయ అధికారి శ్వేతకుమారి అన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు వ్యక్తిగతంగా "కపాస్ కిసాన్" అనే మొబైల్ యాప్‌ను ప్లేస్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకుని తమ మొబైల్ నెంబర్‌తో లాగిన్ అయ్యి, స్లాట్ బుక్ చేసుకుని, స్లాట్ బుక్ అయిన తేదీకి మిల్లుకు పత్తిని తీసుకుని వెళ్లాలన్నారు. స్లాట్ బుక్ చేసుకోకుండా వెళ్తే పత్తి కొనుగోలుకు అవకాశం లేదన్నారు. రైతులు తమ ఫోన్‌నెంబరు యాక్టివేషన్ లేనివారు సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారిని సంప్రతించాలన్నారు.

## నేరచరితులు సత్ప్రవర్తనతో మెలగాలి

**-అల్లాదుర్గం సిఐ రేణుకరెడ్డి**



పాత నేరస్థులకు అల్లాదుర్గం సిఐ సూచనలు చేస్తున్న దృశ్యం

**టేక్మాల్, అక్టోబరు 17, ప్రభాతవార్త:**
నేరచరితకలిగినవారు సత్ప్రవర్తనతో మెదలాలని వారిపై నిరంతరనిఘా ఉంటుందని అల్లాదుర్గం సర్కిల్ ఇన్స్పెక్టర్ రేణుకరెడ్డి అన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం టేక్మాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిస్టరీ షీటర్స్ (నేరచరిత కలిగిన పాతనేరస్థులకు) అల్లాదుర్గం సిఐ రేణుకరెడ్డి పలు సూచనలు ఇచ్చారు. టేక్మాల్ పోలీస్‌స్టేషన్లో హిస్టరీ షీటర్స్‌కు సూచన సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా అల్లాదుర్గం సిఐ రేణుకరెడ్డి మాట్లాడుతూ హిస్టరీ షీటర్స్ ఎలాంటినేరాలకు పాల్పడకుండా సద్బుద్ధితో ఉండాలన్నారు. పాతనేరస్థులపై నిఘాపెట్టి ఎలాంటి నేరాలు చేయకుండా పెట్రోలింగ్ సిబ్బందితో చెక్‌చేయడం జరుగుతుందని తెలిపారు. అందువల్ల హిస్టరీ షీటర్స్ తమ ప్రవర్తనలో మార్పు రావాలని కోరుతున్నామని ఈ విషయాన్ని వారు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో టేక్మాల్ ఎస్సై రాజేష్‌లతోపాటు తదితరులు పాల్గొన్నారు.